క్లుప్తంగా

నేడు కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

కృష్ణా: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఉదయం 10గంటలకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ దయాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎంపీపీ, జెడ్పీటీసీలు హాజరవుతున్నారని తెలిపారు.

యాదాద్రి సన్నిధిలో పల్లెగడ్డ సేవ బృందం



మరికల్: యాదాద్రి పుణ్యక్షేత్రంలో భక్తులకు సేవలు నిర్వహించేందుకు మండలంలోని పల్లెగడ్డ శ్రీవారి సేవ బృందం సభ్యులు ఆదివారం అక్కడికి చేరుకున్నారు. సోమవారం నుంచి సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు సేవలు చేయడమే కాకుండా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించడం, ప్రసాదాలు తయారు చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు టీటీడీ సేవ బృందం సభ్యులు శ్రీరామ్ తెలిపారు.

పది ఎకరాల వరకే రైతుబంధు ఇవ్వాలి



ధన్వాడ: పదిఎకరాల వరకే, పంట వేసిన రైతులకే రైతుబంధు ఇవ్వాలని పలువురు రైతులు వారి అభిప్రాయలను తెలియజేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులతో అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. పలువురు రైతులు మాట్లాడుతూ.. వందల ఎకరాలు ఉన్న రైతులకు రైతుబంధు ఇవ్వడంతో తాము నష్ట పోతున్నామని కేవలం పంటలు వేస్తున్న రైతులకు మాత్రమే రైతుబంధు ఇవ్వాలని రైతులు అభిప్రాయలు తెలియజేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్‌సుధాకర్, ఎంపీటీసీలు ఉమేష్, గోవర్ధన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు గండిబాల్‌రాజు, సీఈఓ వెంకట్రాములు, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

అన్నపూర్ణదేవికి ప్రత్యేక పూజలు



దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామివారి ఆలయంలో అన్నపూర్ణ దేవి ఆరో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు జంగం శరణయ్య స్వామి సమక్షంలో అమ్మవారికి పంచామృతాభిషేకం అలంకరణ హారతి, భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి కల్యాణం, సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పూజ కార్యక్రమంలో దాతలు కానగడ్డ బస్వరాజ్ సువర్ణమ్మ కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణ, గుల్బర్గా గోవిందరాజ్ పాల్గొన్నారు.

నేడు రైతు సదస్సు

దామరగిద్ద: ప్రభుత్వం ప్రారంభించనున్న రైతుబంధు పథకం అమలులో భాగంగా రైతుల నుంచి సలహాలు సూచనలు సేకరించేందుకు పీఏసీఎస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయ షేకరణ సదస్సును నిర్వహిస్తున్నట్లు విండో అధ్యక్షుడు ఈదప్ప, కార్యదర్శి మురారి, వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న సదస్సును రైతులు అధిక సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

పీఆర్టీయూ నాయకుడి మృతికి సంతాపం



లక్ష్మారెడ్డి (ఫైల్)

నారాయణపేట రూరల్: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి (50) మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఊట్కూర్‌కి చెందిన ఈయన 2002 డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికై లక్ష్మీపల్లిలో తొలిసారి ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. తర్వాత మొగ్దుంపూర్, నిడుగుర్తి పాఠశాలల్లో పనిచేశారు. గత రెండేళ్ల క్రితం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నియమించబడ్డారు. కాగా ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో భాగంగా ఆయన స్థాన చలనం జరుగుతుండటంతో నిడుగుర్తి పాఠశాలలో విద్యార్థులు కేక్ కట్ చేయించారు. ఆదివారం ఉదయం నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా ముందుగా పేటలో ని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది సాయంత్రం మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో గుండెపోటుకు గురై మృతిచెందారు. ఆయన మృతికి పేట, మహబూబ్‌నగర్ డీఈఓలు ఎండీ అబ్దుల్‌ఘని, ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, జిల్లా పరీక్షల విభాగం అధికారి రమేష్‌శెట్టి, డీవైఎస్‌ఓ వెంకటేష్, ఎంఈఓ వెంకటయ్య, గోపాల్‌నాయక్, పీఆర్‌టీయూ, తపస్, టీపీటీఎఫ్ జిల్లా బాధ్యులు నర్సింహారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

అండగా నిలుస్తూ.. పునర్జన్మనిస్తూ..



రోగుల సేవలో తరిస్తున్న వైద్యులు

- ఆపద కాలంలో రోగుల పాలిట ఆపద్బాంధవులు
- ప్రభుత్వ రంగంలో మెరుగైన వైద్యసేవల్లో ముందడుగు

పాలమూరు: ప్రాణం పోసేది బ్రహ్మ అయితే పునర్జన్మ ఇచ్చేది వైద్యుడు. అందుకే వైద్యో నారాయణో హరి అని అన్నారు పెద్దలు. ప్రతి ఒక్కరూ వైద్యుడిలో దేవుడిని చూస్తారు. ఎంత గొప్ప వ్యక్తి అయినా.. పేదవాళ్లు అయినా చేతులెత్తి నమస్కరించేది వైద్యులకు మాత్రమే. ప్రాణపాయ స్థితిలో ఉన్నా.. ప్రమాదంలో గాయపడినా.. ఎలాంటి ఆపద వచ్చినా గుర్తుకు వచ్చేది వైద్యులే. వారి ఆత్మీయ స్పర్శ రోగికి అపర సంజీవని. ప్రస్తుత పరిస్థితులలో ఆహారం, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా కొత్త కొత్త రోగాలు వస్తున్నాయి. రోజూ వేల మంది రోగులకు వైద్యులు వివిధ రకాల చికిత్సలు అందిస్తున్నారు. రోగుల ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నారు. ఎంతో మంది వైద్యులు మానవత్వంతో అభాగ్యులకు సేవలందిస్తూ.. అందరి మన్ననలు పొందుతున్నారు. సోమవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల 2016లో ప్రారంభం కాగా.. ఇప్పటి వరకు 450 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్నారు. 2016లో 150 మంది, 2017లో 150, 2018లో 150 మంది వైద్యవిద్య అభ్యసించారు. ప్రస్తుతం 2019 బ్యాచ్‌లో 175 మంది హౌజ్ సర్జన్లుగా జిల్లా జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఇక 2020 బ్యాచ్‌లో 175 మంది, 2021లో 175 మంది, 2022లో 175 మంది, 2023లో 175 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు మెడికల్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 875 మంది విద్యార్థులు భవిష్యత్‌లో వైద్యులుగా సేవలు అందించనున్నారు.

22 ఏళ్ల అనుభవం..



ఉస్మానియా యూనివర్సిటీలో 1992 నుంచి 1996 వరకు ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత గాంధీలో 2002లో జనరల్ సర్జరీ విభాగంలో ఎంఎస్ పూర్తిచేశా. అనంతరం మూడేళ్లపాటు యూకేలో శిక్షణ పూర్తి చేసుకొని కర్నూలు, ఉస్మానియా ఆస్పత్రిలో విధులు నిర్వహించాను. గతేడాది నుంచి జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధు లు నిర్వహిస్తున్నాను. ఈ 22 ఏళ్ల అనుభవంలో ఎంతో మందికి సేవలు అందించా. పేదలకు సేవ చేయడం గొప్పగా భావిస్తున్నా. ప్రతి ఒక్కరికీ సహనంతో పరీక్షించడంతో పాటు అర్థమయ్యే విధంగా చెప్పడం అలవాటు చేసుకున్నాను.

– డాక్టర్ జీవన్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

కరోనా సమయంలో ఇంటింటికెళ్లి చికిత్స..



కరోనా సమయంలో ఇంటింటికి తిరిగి చికిత్స అందించడం, ప్రతి ఒక్కరికి ధైర్యం కల్పించడం నా జీవితంలో మరిచిపోలేను. కరోనా పాజిటివ్ వచ్చిన వారి వద్దకు వెళ్లి భరోసా ఇవ్వడంతో పాటు వారికి కావాల్సిన మందులు, సూచనలు ఇచ్చాను. నేను 2014లో కర్నూలులో ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత 2017లో సర్వీస్‌లోకి వచ్చాను. మొదట మిడ్జిల్‌లో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరాను. గతేడాది పీహెచ్‌సీని జాతీయ నాణ్యతా ప్రమాణాల కమిటీ ఎంపిక చేయడం కోసం కృషి చేశాను. దీంతో సర్వీస్ అప్‌గ్రేడ్ కావడం, నిధులు రావడం జరుగుతుంది.

– డాక్టర్ శివకాంత్, మెడికల్ ఆఫీసర్, మిడ్జిల్

ఎన్నో సర్జరీలు చేశాను..



ఉస్మానియా యూనివర్సిటీలో 1987 లో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత 1992 వరకు గాంధీలో ఎంఎస్ జనరల్ సర్జరీ పూర్తిచేయగా.. అదే ఏడాది జహీరాబాద్ సమీపంలోని కోహీర్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. 1996 వరకు అక్కడ పనిచేసి, ఎన్నో సర్జరీలు చేశాను. ఉత్తమ వైద్యుడిగా అవార్డు అందుకున్నా. 1996 నుంచి 2006 వరకు ఉస్మానియాలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన సమయంలో ఎన్నో హైరిస్క్ సర్జరీలు చేసి, ప్రాణాలు కాపాడిన సందర్భాలు ఉన్నాయి. 2006 నుంచి 2008 వరకు కర్నూలు మెడికల్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2009 నుంచి 2012 వరకు గాంధీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ఆ తర్వాత 2012 నుంచి 2021 వరకు ఉస్మానియాలో ప్రొఫెసర్‌గా, జనరల్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీగా పనిచేశాను. ఆ తర్వాత ఏడీఎంఈగా పదోన్నతి లభించి, మహబూబ్‌నగర్‌కు వచ్చాను.

– డాక్టర్ రమేష్, మెడికల్ కళాశాల డైరెక్టర్, మహబూబ్‌నగర్

బస్సులో డెలివరీ చేయడం మరిచిపోలేను..



2010లో ఎంబీబీఎస్ పూర్తిచేయగా.. 2011 నుంచి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో పనిచేశాను. హన్వాడలో ఏడాది పాటు పని చేసిన తర్వాత జానంపేట పీహెచ్‌సీకి వెళ్లాను. 2014లో పోస్టింగ్ రెగ్యులర్ కావడం జరిగింది. జానంపేట నుంచి ఓ రోజు మహబూబ్‌నగర్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్తుంటే.. ఓ గర్భిణి కొత్తకోట నుంచి రెఫర్ మీద ప్రసవం కోసం జిల్లా ఆస్పత్రికి వస్తుంది. ఈ క్రమంలో మార్గంమధ్యలో ఆమెకు నొప్పులు రావడంతో బస్సులోనే నేను డెలివరీ చేశాను. ఆ ఘటనను నా జీవితంలో మరిచిపోలేను. తల్లీబిడ్డలను పీహెచ్‌సీకి తీసుకెళ్లి, చికిత్స అందించి కావాల్సిన బెనిఫిట్స్ అందించాం. జాతీయస్థాయిలో ఒకసారి, రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు అవార్డులు తీసుకున్నాను.

– డాక్టర్ శ్వేతారెడ్డి

ఏడాదిన్నరలో 435 సాధారణ కాన్పులు..



ఏడాదిన్నర కాలంలో దేవరకద్ర పీహెచ్‌సీలో 435 సాధారణ కాన్పులు చేశాం. సాధారణ ఓపీతో పాటు ప్రసవాలపై ఎక్కువ దృష్టి సారించాను. పీహెచ్‌సీల వారీగా పరిశీలిస్తే.. జిల్లాలో అత్యధిక కాన్పులు ఇక్కడే అవుతాయి. దీంట్లో కొంత వరకు హైరిస్క్ ఉన్న కేసులు సైతం బాధ్యతగా తీసుకుని ప్రసవాలు చేయడం జరిగింది. నేను 2015లో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత లట్టుపల్లి, బిజినేపల్లి, కోయిలకొండ సివిల్ ఆస్పత్రి, మహబూబ్‌నగర్, ప్రస్తుతం దేవరకద్రలో పనిచేస్తున్నాను. 24 గంటల్లో ఎప్పుడూ డెలవరీ కోసం వచ్చినా నాతో పాటు సిబ్బంది సిద్ధంగా ఉంటారు. ఈ ఏడాది జనవరి 26న ఉత్తమ వైద్యుడిగా ప్రశంసపత్రం అందుకున్నా.

– డాక్టర్ శరత్‌చంద్ర, పీహెచ్‌సీ, దేవరకద్ర

గిరిజన ప్రాంతాల్లో సేవలు..



కొల్లాపూర్ గిరిజన ఏరియాలో విధులు నిర్వహించే క్రమంలో ప్రయాణానికి నిత్యం ఇబ్బందులు పడేవాళ్లం. పది నెలలపాటు ఆ ఏరియాలో ఉన్న ప్రతి గ్రామాన్ని సందర్శించాం. డెంగీ కేసులు అధికంగా వచ్చిన సందర్భంగా ఒక అమ్మాయికి పరిస్థితి ఇబ్బందిగా ఉంటే, మెరుగైన చికిత్స అందించడంతో పాటు ఇంటికి వెళ్లి పర్యవేక్షించాను. నేను 2015లో కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత జనరల్ ఆస్పత్రిలో ఎస్ఆర్‌సీలో రెండు ఏళ్లపాటు పనిచేశాను. హైదరాబాద్ బస్తీ దవాఖానలో, కొల్లాపూర్‌లో పనిచేశాను. గతేడాది జనవరి 1నుంచి జనరల్ ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ క్యాడర్‌లో ఆర్ఎంఓగా పనిచేస్తున్నాను. రాబోయే రోజుల్లో గైనిక్ పూర్తిచేసి, మంచి గైనకాలజిస్ట్‌గా గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది.

– డాక్టర్ శిరీష, ఆర్ఎంఓ, జనరల్ ఆస్పత్రి

వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరి



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ శివశంకర్

నారాయణపేట రూరల్: ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని సీఐ శివశంకర్ అన్నారు. ఆదివారం ట్రాఫిక్ సిబ్బందితో కలిసి పట్టణ శివారులోని ఎర్రగుట్ట సమీపంలో విస్తృత తనిఖీలు చేపట్టి నంబర్‌ప్లేట్ లేని వాహనాలను గుర్తించి వాటికి నంబర్ ప్లేట్ వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నంబర్‌ప్లేట్ లేకపోతే సదరు వాహనాలను క్రైమ్ చేయడానికి వాడుతున్నారని గుర్తించాల్సి వస్తుందన్నారు. నిబంధనల ప్రకారమే నంబర్ ప్లేట్ ఏర్పాటు చేయాలని, ఇష్టారీతిగా ఉండొద్దని సూచించారు. అదేవిధంగా జర్నలిస్టులు కానివారు ప్రెస్ స్టిక్కర్లు పెట్టకోరాదన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సీటుబెల్టును తప్పనిసరిగా ఉపయోగించాలని, అవి మన ప్రాణాలను కాపాడుతాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా సర్కిల్ పరిధిలోని దామరగిద్ద, ధన్వాడ, నారాయణపేట టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో వివిధ చోట్ల వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆయా కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేశ్వర్లు, కృష్ణదేవ్, రమేష్ పాల్గొన్నారు.

ప్రజలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఆర్ఐ శ్రీనివాసులు

నారాయణపేట రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకుని ఉండాలని అధికారులు అన్నారు. ప్రతి నెల చివరిరోజు జిల్లాలో సివిల్‌రైట్స్ డే నిర్వహించాలనే ఆదేశాలతో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక గ్రామం ఎంపిక చేసి ఆదివారం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు, రెవెన్యూ అధికారులతో కలిసి ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, సంబంధిత పీఎస్‌ల ఎస్ఐ, ఏఎస్ఐలు పాల్గొని మాట్లాడారు. మండలంలోని కోటకొండ జీపీలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛగా జీవించే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. బీద, ధనిక తేడా లేకుండా అందరు సమానంగా సేవలను పొందొచ్చని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



మక్తల్: పట్టణంలోని వీఓఏలు తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ఆదివారం వినతి ప్రతాన్ని అందజేశారు. తమ జీతాలు సక్రమంగా చెల్లించడంలేదని, తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను విన్నవించారు. ఈ విషయంపై జిల్లా పీడీ అధికారితో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఫోన్‌లో మాట్లాడారు.. కార్యక్రమంలో వీఓఏలు యూనియాన్ అధ్యక్షుడు కతలప్ప, యూనుస్‌ఖాన్, గోపాల్, కొండరెడ్డి, సుజాత, వెంకటేశ్వరమ్మ, మహేందర్ పాల్గొన్నారు.

కస్తుర్బా పాఠశాల భవనం ప్రారంభించాలి

మరికల్: ధన్వాడలో కస్తుర్బా పాఠశాలలో గదుల కొరతతో మండలంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే కస్తుర్బా భవనం ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, నర్సింహులు అన్నారు. ఆదివారం వారు విలేకులతో మా ట్లాడుతూ పస్పుల వద్ద నిర్మించిన భవనాన్ని ఆలస్యం చేయకుండా ప్రారంభిస్తే విద్యార్థుల ఇబ్బందులు తీరుతాయన్నారు. ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి సన్మానం



మక్తల్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా గెలిచిన నవీన్‌కుమార్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆదివారం ఆయన నివాసంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేష్‌గౌడ్, నర్సింహగౌడ్, చిన్నహన్మంతు, నేతాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా గెలిచిన నవీన్‌కుమార్‌రెడ్డిని మండల బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు.. ఆ పార్టీ మండల నాయకుడు శివరాజ్‌పాటీల్ మాట్లాడుతూ.. తమ మండలానికి అత్యధికంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ, బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్, తిమ్మప్ప, శివప్ప పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారిగా ఊట్కూర్ వాసి



ఊట్కూరు: మండలానికి చెందిన కిష్టాపురం కొలప్ప నిరుపేదకుటుంబంలో పుట్టిన పట్టుదలతో చదివి వ్యవసాయ అధికారిగా ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన కిష్టాపురం హన్మంతు, సూగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె పెద్ద కుమారుడైన కోలప్ప 1–10 వ తరగతి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదవుకున్నారు. అగ్రికల్చర్ ఎంపీఎస్సీ మహారాష్ట్రలో వివిఎంఏయూ కళాశాలలో చదువుకున్నాడు. నెలరోజుల క్రితం జరిగిన ఎంట్రెన్స్‌లో ప్రతిభ కనబర్చడంతో వ్యవసాయ అధికారిగా ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబంలో పుట్టి క్రమశిక్షణతో చదివి వ్యవసాయ అధికారిగా ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు సూర్య ప్రకాష్‌రెడ్డి అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడుదాం..



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూరు: గ్రామాల్లో అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మండలంలోని సమస్తాపురంలో శంకర్‌లింగేశ్వరి స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు వేసేందుకు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డుకోసం రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు పర్చేందుకు కట్టుబడి ఉందన్నారు. ఉచిత విద్యుత్‌కోసం ఎవరైన దరఖాస్తు చేసుకోని వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మినారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మణెమ్మ, విఙ్ఞేశ్వర్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్, బీమకవి, ఎల్లప్ప, సమృద్ధి, రవి తదితరులు పాల్గొన్నారు.

సాగు పనుల్లో రైతన్న బిజీ బిజీ



పొలంలో పత్తి విత్తనాలు నాటుతున్న మహిళలు



మరికల్‌లో నారుమళ్లలో మొలక చల్లుతున్న రైతు

కోస్గి: మండల పరిధిలో రెండు రోజుల క్రిత కురిసిన మోస్తారు వర్షాలకు రైతులు వానాకాలం సాగు పనులను ప్రారంభించారు. తొలకరి వానలకు కొందరు రైతులు జొన్నలు, కంది విత్తనాలు వేశారు. గత మూడు రోజుల క్రితం వర్షాలు రావడంతో ఆదివారం పలు గ్రామాల్లో రైతులు పొలంబాట పట్టారు. వేసవిలో దుక్కుల్ని సిద్ధం చేసుకున్న రైతులు కందులు, పత్తి విత్తనాలు నాటారు. మండలంలోని ఆయా గ్రామాల్లో విత్తనాలు వేసే పనుల్లో రైతన్నలు బిజీగా మారిపోయారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడి వేసిన పంటలు చేతికందుతాయనే ఆశభావాన్ని పలువురు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

మరికల్: వానాకాలంలో సాగు చేసే ప్రధాన పంట వరి కావడంతో రైతులు ఇప్పుడిప్పుడే నారుమళ్లు సిద్ధం చేసే పనిలో పడ్డారు. ఆరుద్ర కార్తెలో నారు మళ్లు సాగు చేస్తే మరోనెల రోజుల తర్వాత నాట్లు వేసే అవకాశం ఉందని రైతులు తెలుపుతున్నారు. మండలంలో 16వేల ఎకరాలకు పైగా వరిసాగు చేసే అవకాశం ఉంది. మరోపక్క 25రోజుల తర్వాత వరుణుడు కరుణించడంతో రైతులు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు.

రైతు సంక్షేమమే ధ్యేయం..



సమావేశంలో పాల్గొన్న నాయకులు

దామరగిద్ద: భారతీయ కిసాన్ సంఘ్ రైతు సంక్షేమం కోసమే నితంతరం పోరాటం చేస్తుందని బీకేఎస్ జిల్లా నాయకులు బాల్‌చందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఉడ్మల్‌గిద్దలో బీకేఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొనే. బ్యాంకు రుణాలు, విద్యుత్ సమస్య, రుణమాఫీ వంటి వివిధ సమస్యలపై నిరంతరం కృషచేస్తుందన్నారు. అనంతరం గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా జీల భీంషప్ప, ఉపాధ్యక్షుడిగా మెబుపాషా, కార్యదర్శిగా తమ్మనోళ్ల, గోపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా మాల బుగ్గేష్, కో–శాధికారిగా రాములు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కు చట్టం అమలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బాల్‌రాం

మరికల్: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తే చూస్తు ఊరుకోమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం అన్నారు. మండలంలోని ఆదివారం కార్మిక సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల నుంచి కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వం మళ్లీ కూటమి పేరుతో అధికారంలోకి వచ్చి కార్మికులను మోసం చేయాలని చూస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్తంగా కార్మికులు పోరాట బాట పట్టారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ వెంటనే వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేసేలా చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుపతమ్మ, వెంకటేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దామరగిద్దలో పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఏయిడేడ్ వైధికోన్నత పాఠశాలలో 1993–94విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న విద్యార్థులు పట్టణ శివారులోని లక్ష్మి బంక్వట్‌హాల్‌లో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు చదువుకున్న పాఠశాల ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ మేరకు.. 30సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, వారి జీవిత విషయాలను చర్చించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2002–03 బ్యాచ్ పదోతరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళానాన్ని నిర్వహించారు. 22ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను ఉపాధ్యాయులు విద్యార్థులతో పంచుకున్నారు. ఈ మేరకు.. ఉపాధ్యాయులు భరత్‌కుమార్ ముంతాజ్‌బేగం, మైనోద్దీన్ మాట్లాడారు.. విద్యార్థులు వివిధ రంగాల్లో ఎదగడం ప్రభుత్వ ఉద్యోగాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం ఉపాధ్యాయలకు శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తంటాలు



మాగనూర్: మండల పరిధిలోని ఉజ్జెల్లిలో గత కొన్నిరోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గ్రామంలో నీటి ఎద్దడి ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందన కరువైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నిత్యం నీటి కోసం గంటల తరబడి సమయం కేటాయించి ఇళ్లలో ఉన్న బోరుబావుల వద్ద వేచి చూడాల్సిన అవసరం పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామానికి తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్



మాగనూర్: మండల పరిధిలోని కొల్పూర్‌లో మిషన్‌భగీరథ ట్యాంక్ ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత ట్యాంక్ కావడంతో నిత్యం పెచ్చులుడి, రోజురోజుకు పిల్లర్లు మొత్తం ప్రమాదకరంగా మారిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ మరమ్మతులు చేపట్టి, దాని స్థానంలో మరో ట్యాంక్ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రికెట్ అభిమానుల సంబరాలు



మరికల్: భారత్ ప్రపంచకప్‌ను గెలుచుకోవడంతో అర్ధరాత్రి జై హనుమాన్ యూత్ సభ్యులు సంబరాలు చేసుకున్నారు. 17ఏళ్ల తర్వాత 20 ప్రపంచ కప్ గెలుపొందడంతో యువకులు రోడ్లపైకి వచ్చి బాణాసంచా కాల్చి విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. అలాగే అన్ని గ్రామాల్లో క్రికెట్ అభిమానులు భారత్ క్రికెట్ జట్టుకు శుభాకంక్షాలు తెలిపారు.